بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ



## వార్షిక మహా సభ యు.కే. 2026 సందర్భమున
## దైవానుగ్రహాలు మరియు అహ్మదియేతర అతిథుల అభిప్రాయాల ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 31.07.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشۡهَدُ أَنۡ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ. أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ.
بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ○ إِيَّاكَ نَعۡبُدُ وَإِيَّاكَ نَسۡتَعِيۡنُ ○ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ○ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

అల్లాహ్ తఆలా కృపానుసారం గత ఆదివారం అహ్మదియ్యహ్ జమాఅత్ యూకే మూడు రోజుల జల్సా సాలానా అల్లాహ్ తఆలా అనుగ్రహాలను మూటగట్టుకుంటూ ముగిసింది. జల్సా ఏర్పాటుకు నెలల సమయం పడుతుంది. ఒక జల్సా ముగిసిన వెంటనే తదుపరి జల్సా తయారీ ప్రారంభమవుతుంది. దీని వేగం జల్సాకు కొన్ని వారాల ముందు మొదలై, ఆ తర్వాత ఒకట్రెండు వారాల ముందు మరింత తీవ్రమవుతుంది. జల్సా రోజుల్లో వేలాది మంది పురుషులు, స్త్రీలు, వృద్ధులు మరియు యువ వాలంటీర్లు తమ నైపుణ్యాలు మరియు అంకితభావంతో అహర్నిశలూ సేవలందిస్తుంటారు.

కావున ఈ రకంగా, జల్సాలోని ఏ విభాగంలోనైనా పనిచేసిన సేవకులందరూ కృతజ్ఞతలకు అర్హులు. అల్లాహ్ తఆలా వారికి ఈ సేవకు ఉత్తమ ప్రతిఫలాన్ని ప్రసాదించుగాక. అలాగే ఎమ్‌టిఏ (MTA) సేవకులున్నారు, వీరిలో అత్యధికులు వాలంటీర్లే. ఆ తర్వాత ప్రెస్ అండ్ మీడియా టీమ్ కూడా ఉంది. ఖుద్దాముల్ అహ్మదియ్యహ్ కెనడాకు చెందిన యువకులు ప్రతి సంవత్సరం లాగే పెద్ద సంఖ్యలో ఇక్కడికి వచ్చి వైండ్-అప్ (సర్దుబాటు) పనుల్లో సేవలు అందించారు. ఇప్పుడు ఆస్ట్రేలియా వారు కూడా రావడం ప్రారంభించారు, వీరంతా ఎంతో అద్భుతమైన రీతిలో పనిచేస్తున్నారు.

నేను స్వయంగా కూడా సేవకులందరికీ (స్త్రీ, పురుషులకు) కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను, అయితే దీనితో పాటు వారు కూడా అల్లాహ్ తఆలాకు కృతజ్ఞతలు తెలుపుకోవాలని గుర్తుంచుకోవలెను. ఎందుకంటే హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం అతిథులకు సేవ చేసే భాగ్యం అల్లాహ్ తఆలా వారందరికీ ప్రసాదించాడు. ప్రజల కృతజ్ఞతా భావాన్ని చూసి మీరు దేవుని ముందు మరింతగా మోకరిల్లాలి, మరింత వినయాన్ని పెంపొందించుకోవలెను. అల్లాహ్ మిమ్ములను ఇందుకు అనుగ్రహించుగాక.

హుజూర్ అన్వర్ ఇట్లు ఉపదేశించారు: పని చేసేవారి పట్టుదల, ఉత్సాహం ద్వారా ఇస్లాం, అహ్మదియ్యహ్ ప్రచారం కూడా జరుగుతుంది. చాలా మంది ప్రజలు తమ భావాలను, పరిశీలనలను వ్యాఖ్యల రూపంలో వ్రాసి పంపుతారు. వారిలో కొందరి అభిప్రాయాలను నేనిప్పుడు మీ ముందుంచుతాను.

గాంబియా కమ్యూనికేషన్ల మంత్రి వ్రాస్తూ, జల్సా సాలానా లోతైన సత్యాన్ని చూసి తాను ఆశ్చర్యపోయానని పేర్కొన్నారు. ఇది స్వార్థం లేని సేవ మరియు నిశ్శబ్ద, నిలకడైన త్యాగం పునాదిపై

నిర్మితమైన ఒక గొప్ప ప్రపంచ మహాసభ.

సగం రాష్ట్రం తమ పరిధిలో ఉన్నటువంటి నైజీరియాకు చెందిన ఒక రాజు ఇలా అంటున్నారు: నేను యూకే జల్సా సాలానాకు బయలుదేరినప్పుడు, నా జీవితంలో ఇంతటి లోతైన ప్రభావాన్ని చూపే ఒక అత్యంత వైభవమైన, సువ్యవస్థితమైన, ఆధ్యాత్మిక సమావేశంలో భాగం కాబోతున్నానని ఊహించలేదు. ఇక్కడకు వచ్చిన తర్వాత నేను అసాధారణమైన క్రమశిక్షణ, సోదరభావం, మానవసేవకు సంబంధించిన ఆచరణాత్మక ఉదాహరణను చూడటమే కాకుండా, ప్రపంచంలోని వివిధ దేశాలు, జాతీయతలకు చెందిన ప్రజలు ప్రేమ, గౌరవం, సోదరభావాల బంధంలో అల్లుకుపోవడం చూశాను.

ఆయన భార్య మాట్లాడుతూ, మహిళల కోసం చేసిన ఆదర్శవంతమైన ఏర్పాట్లు, వారి గౌరవం, స్వేచ్ఛ మరియు వాతావరణాన్ని చూసి నేను అత్యంత ఆశ్చర్యపోయాను. వేలాది మంది మహిళలు అత్యంత గౌరవప్రదంగా, క్రమబద్ధమైన రీతిలో జల్సాకు రావడం, పోవడం చూసి ఇస్లాం పట్ల నాకున్న అనేక అభిప్రాయాలు మారిపోయాయి అని అన్నారు.

సెనెగల్ మాజీ గవర్నర్ సెయింట్ లూయిస్ అతిథిగా హాజరయ్యారు. ఆయన ఇలా అంటున్నారు: నేను ఉపన్యాసాలన్నిటిని శ్రద్ధగా విన్నాను. అనువాద ఏర్పాట్లు చాలా అద్భుతంగా ఉన్నాయి, దానివల్ల మేమంతా ఉపన్యాసాలను, సందేశాలను సరిగ్గా అర్థం చేసుకోగలిగాము. జల్సా సమయంలో అత్యంత ప్రముఖంగా నిలిచిన సందేశం ప్రేమ, శాంతి మరియు సోదరభావాల సందేశమే.

లక్సెంబర్గ్ నుండి ఒక బారిస్టర్ గారు విచ్చేశారు. ఆయన ఇలా అంటున్నారు: జల్సా సందర్భమున ఈ మూడు రోజులు నా జీవితంలో అత్యంత ముఖ్యమైన మూడు రోజులుగా మారాయి. నా జీవితంలో మొదటిసారిగా ఇంత పెద్ద, సువ్యవస్థితమైన ఇస్లామిక్ సమావేశాన్ని చూశాను. అంతర్జాతీయ దైవ ప్రతిజ్ఞ (ఆలమీ బైఅత్) ఆధ్యాత్మిక దృశ్యం నా జీవితంలో మరచిపోలేనిది. జమాఅత్ ఇమామ్ గారితో నా భేటీ జరిగింది. భేటీకి ముందు నాకు కొంత కంగారుగా అనిపించినప్పటికీ, ఆయనను కలవగానే ఆ కంగారంతా మాయమైపోయింది.

కొత్తగా అహ్మదియ్యత్ ఇస్లాం స్వీకరించిన ఒక వ్యక్తి ఇలా అంటున్నారు: ఇస్లాం స్వీకరించడానికి ముందు నేను క్రైస్తవ మతానికి చెందినవాడిని. విశ్వాసానికి సంగీతంతో సంబంధం ఉంటుందని మాకు నేర్పించేవారు. కానీ నేను ఎన్నడూ ఆ రీతిలో ఆధ్యాత్మిక ప్రశాంతతను మరియు దైవ సాన్నిధ్యాన్ని అనుభవించలేకపోయాను. ముస్లింగా మారిన తర్వాత కూడా నేను నమాజ్ మొదలైనవి చదివినప్పటికీ, నాలో ఆ ఆధ్యాత్మిక అనుభూతి లోపించేది. అయితే జల్సాలో పాల్గొన్న తర్వాత నాపై ఎలాంటి ఆధ్యాత్మిక స్థితి ఆవహించిందంటే. నా కళ్ల నుండి నీళ్లు కారడం మొదలయ్యాయి, నేను నిరంతరం దుఆలు చేస్తూనే ఉన్నాను. నాలో అల్లాహ్ తఆలాతో, ఖిలాఫత్‌తో ఒక ఆధ్యాత్మిక బంధం ఏర్పడింది.

చెక్ రిపబ్లిక్ నుండి ఇద్దరు ప్రొఫెసర్లు వచ్చారు, వారిలా అంటున్నారు: చెక్ రిపబ్లిక్ తిరిగి వెళ్లిన తర్వాత మేము మా సహచరులకు, విద్యార్థులకు స్వయంగా వెళ్లి ఈ వైభవమైన సమావేశాన్ని చూడమని చెబుతాము. ఖలీఫతుల్ మసీహ్ ప్రసంగం తర్వాత మాకు ఇస్లాం, దైవభీతి నిజమైన గుర్తింపు లభించింది.

కజకిస్తాన్ నుండి ఒక మహిళ జల్సాలో పాల్గొన్నారు, ఆమె ఇలా అంటున్నారు: జమాఅత్ ఇమామ్, ఇతర ప్రసంగీకుల ప్రసంగాలలో విశ్వాసం, ఉన్నతమైన నైతిక విలువలు, పరస్పర సామరస్యం, యువకుల సమస్యలు, సమాజ శిక్షణ వంటి ముఖ్యమైన అంశాలపై వెలుగు చిందించారు.

అమెరికా నుండి వచ్చిన ఒక న్యాయశాస్త్ర ప్రొఫెసర్ గారిలా అన్నారు. నాకు ప్రపంచవ్యాప్తంగా అనేక కన్వెన్షన్లు, కాన్ఫరెన్సులలో పాల్గొనే అవకాశం లభించింది, కానీ యూకే జల్సా సాలానా అనుభవం వాటిన్నింటికంటే ప్రత్యేకమైనది. వందకు పైగా దేశాల నుండి వచ్చిన ప్రజలు, విభిన్న మతాలు, జాతీయతలు మరియు విభిన్న రంగానికి చెందిన వ్యక్తులతో భేటీ జరిగింది. వివిధ ప్రదర్శనలు నన్ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉన్నత విద్యనభ్యసించిన డాక్టర్లు, ఇంజనీర్లు, లాయర్లు, ఇతర రంగానికి చెందిన నిపుణులు ఎంతో వినయంతో సేవలందిస్తున్నారు, ఈ అంశం నన్ను అమితంగా ప్రభావితం చేసింది.

బ్రెజిల్ నుండి వచ్చిన ఒక టెలివిజన్ రిపోర్టర్ ఇలా అంటున్నారు: ఈ కార్యక్రమం భారీ స్థాయిని మరియు విస్తృతిని చూసి నేను ఆశ్చర్యపోయాను. ముఖ్యంగా లంగర్ ఖానా (వంటశాల) పరిమాణం మరియు ఆహారం తయారుచేసే ప్రదేశాలన్నీ ఎంతో విశాలంగా, ఆధునికంగా, సువ్యవస్థితంగా మరియు అత్యంత పరిశుభ్రంగా ఉన్నాయి.

ఫిలిప్పీన్స్ నుండి ఒక ప్రొఫెసర్ గారు స్వయంగా ప్రొఫెసర్ అయిన తన భార్యతో కలిసి విచ్చేశారు. వారు మాట్లాడుతూ, వాలంటీర్ల కష్టాన్ని చూసి ఆశ్చర్యమేసింది, వారు తమ శ్రమతో ఈ తాత్కాలిక నగరాన్ని ఎంత అద్భుతంగా నిర్మిస్తారో అని అన్నారు.

సెంట్రల్ అమెరికన్ పార్లమెంట్‌లో ఎల్ సాల్వడార్ ప్రతినిధిగా ఉన్న ఒక అతిథి అక్కడి నుండి వచ్చారు. ఆయన ఇలా అంటున్నారు: ఖలీఫతుల్ మసీహ్ గారితో భేటీ తర్వాత, ఖలీఫా గారికి తన జమాఅత్ గురించి అత్యంత సమగ్రమైన సమాచారం ఉంటుందని నాకు పూర్తిగా నమ్మకం కలిగింది.

కొత్తగా అహ్మదియ్యత్ ఇస్లాం స్వీకరించిన మహిళ ఒకరు బెలిజ్ నుండి వచ్చారు. ఇలా అంటున్నారు: మేము చాలా చిన్న దేశానికి చెందినవాళ్లం. నేను ఉండే నగరం జనాభా కేవలం యాభై వేలు మాత్రమే. అక్కడ ఒక వంద మంది గుమిగూడినా గొడవలు మొదలవుతాయి, కానీ జల్సా నిర్వహణలో అసాధారణమైన శాంతి భద్రతలు కనిపించాయి.

బల్గేరియా నుండి వచ్చిన ఒక ప్రఖ్యాత వ్యక్తి ఇలా అన్నారు: జల్సాలో జరిగిన ఉపన్యాసాలు చాలా సమాచారంతో కూడినవిగా, జ్ఞానదాయకంగా మరియు ఉన్నత ప్రమాణాలతో ఉన్నాయి. ప్రసంగీకులు మతపరమైన, శాస్త్రీయ అంశాలను ఎంతో అద్భుతమైన రీతిలో సమర్పించారు, దీనివల్ల శ్రోతల జ్ఞానం మరియు అవగాహన పెరిగాయి.

సెనెగల్ నుండి వచ్చిన ఒక ప్రాంతీయ మత నాయకుడు ఇలా అంటున్నారు: జమాఅత్ ఇమామ్ గారితో నా భేటీ జరిగింది, దానివల్ల నాకు జమాఅత్‌ను అర్థం చేసుకోవడానికి మంచి అవకాశం లభించింది. వాస్తవానికి నేను మీకు హృదయపూర్వకంగా నివాళులు అర్పిస్తున్నాను.

సెనెగల్ నుండి ఒక పార్లమెంట్ సభ్యుడు హాజరయ్యారు, ఆయన ఇలా అంటున్నారు: కేవలం మాటలకే పరిమితమైన ఇస్లాం కంటే మించి, ఇక్కడ నేను నిజమైన సేవ చేసే ఇస్లాంను చూశాను. ఇచ్చే చేతులను చూశాను, క్షమించే హృదయాలను చూశాను, ఇతరుల కోసం ఎల్లప్పుడూ తెరిచి ఉండే తలుపులను చూశాను.

కొసావో నుండి ఒక అత్యంత గౌరవనీయులైన పరిశోధకుడు, విద్యావేత్త అయిన ప్రొఫెసర్ గారు జల్సాలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ: జమాఅత్ ఇమామ్ గారి ఉపన్యాసాలు వినే అవకాశం లభించింది, ఆయనతో భేటీ కూడా జరిగింది. నన్ను అత్యంత అమితంగా ప్రభావితం చేసిన అంశం

శాంతి, సర్వమత సామరస్యం, మానవ సమానత్వం, పరస్పర గౌరవం మరియు సమాజంలోని ప్రతి ఒక్కరినీ కలుపుకుని ముందుకు సాగడంపై నిరంతరం మరియు అసాధారణంగా నొక్కి చెప్పడమే.

స్పెయిన్ లోని పెడ్రోఅబాద్ మేయర్ విచ్చేశారు. ఆయనిట్లు అంటున్నారు: జల్సా సాలానా మాకు ఒక విషయాన్ని చూసే అవకాశం ఇచ్చింది, అదేమిటనగా ఇది కేవలం విశ్వాసంతో కూడిన వేడుక మాత్రమే కాదు, వివిధ దేశాలు, సంస్కృతులు మరియు జీవన సత్యాలకు చెందిన ప్రజల మధ్య కలిసి ఉండడానికి సంబంధించిన ఒక అసాధారణమైన ప్రదర్శన.

అదేవిధంగా హుజూరె అన్వర్ జల్సా అసాధారణమైన ఏర్పాట్లను, ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రశంసించిన మరికొందరు గౌరవనీయ అతిథుల పరిశీలనలను, అభిప్రాయాలను కూడా వివరించారు.

గ్రీస్ నుండి వచ్చిన ఒక మహిళా అతిథి జల్సాలోని అన్ని అంశాలను ప్రశంసిస్తూనే ఒక విషయాన్ని ప్రస్తావించారు. ఆ విషయం తనకు నచ్చలేదని చెబుతూ కొందరు మహిళలు ఇస్లామిక్ డ్రెస్ కోడ్ (పర్దా) ను సరిగ్గా పాటించడం లేదు, అలాగే కొందరు పురుషులు కూడా చూపులను కిందకు ఉంచడంలో (గజ్జె బసర్) బలహీనతను కనబరిచారు అని పేర్కొన్నారు.

హుజూరె అన్వర్ ఇలా సూచించారు: అయినప్పటికీ నేను ఈ విషయం గురించి ప్రత్యేకంగా నొక్కిచెప్పాను. మన సంస్కరణ కోసం మనం ప్రతికూల వ్యాఖ్యలను కూడా వినవలెను. కాబట్టి ఎవరైతే నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారో వారు ఒక విషయాన్ని గుర్తుంచుకోవలెను. ఇతరులు మనల్ని ఎంతో సూక్ష్మంగా పరిశీలిస్తారు, ఇస్లాం నిజమైన ప్రతిరూపానికి మచ్చ తెచ్చేలా మనం వారికి ఎలాంటి అవకాశమూ ఇవ్వ కూడదు. జల్సా ప్రసంగాల సమయంలో నేను హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం గారి ఒక పంక్తిని కూడా చదివాను. ఇతరులు మనపై వేలెత్తి చూపడానికి ఎలాంటి అవకాశం ఇవ్వకండి.

జల్సాకు ప్రింట్ మరియు మీడియాలో లభించిన మంచి కవరేజ్ గురించి హుజూరె అన్వర్ ప్రస్తావించారు. ప్రింట్ మీడియా, రేడియో, టీవీ, సోషల్ మీడియా ద్వారా జల్సా సాలానాను విస్తృతంగా ప్రసారం చేశారు, అలాగే వివిధ వార్తాపత్రికలు, టీవీ ఛానెల్‌లు కూడా జల్సాను కవర్ చేశాయి.

ఖుత్బా ముగింపులో హుజూరె అన్వర్ ఇలా ప్రార్థించారు: జల్సా మంచి ప్రభావాలను జమాఅత్ సభ్యులపై ఎల్లప్పుడూ నిలిపి ఉంచడంతో పాటు, అల్లాహ్ తఆలా ప్రజలకు సరైన మార్గదర్శకత్వం ప్రసాదించుగాక! వారిని సరైన ఇస్లాం వైపు, అహ్మదియ్యత్ వైపు ఆకర్షితుల్ని చేయుగాక! (ఆమీన్)

اَلْحَمْدُ لِلّٰہِ نَحْمَدُہٗ وَنَسْتَعِیْنُہٗ وَنَسْتَغْفِرُہٗ وَنُؤْمِنُ بِہٖ وَنَتَوَکَّلُ عَلَیْہِ ۔ وَنَعُوْذُ بِاللّٰہِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَیِّئَاتِ اَعْمَالِنَا ۔ مَنْ یَّھْدِہِ اللّٰہُ فَلَا مُضِلَّ لَہٗ وَمَنْ یُّضْلِلْہُ فَلَا ھَادِیَ لَہٗ ۔ وَنَشْھَدُ اَنْ لَّآ اِلٰہَ اِلَّا اللّٰہُ وَنَشْھَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُہٗ وَرَسُوْلُہٗ ۔ عِبَادَ اللّٰہِ رَحِمَکُمُ اللّٰہُ! اِنَّ اللّٰہَ یَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِیْتَآءِ ذِی الْقُرْبٰی وَیَنْھٰی عَنِ الْفَحْشَآءِ وَالْمُنْکَرِ وَالْبَغْیِ ۔ یَعِظُکُمْ لَعَلَّکُمْ تَذَکَّرُوْنَ ۔ اُذْکُرُوا اللّٰہَ یَذْکُرْکُمْ وَادْعُوْہُ یَسْتَجِبْ لَکُمْ وَلَذِکْرُ اللّٰہِ اَکْبَرُ ۔